క్లుప్తంగా

అవయవ దానం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటరావు

విజయనగరం అర్బన్: అవయవ దానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎన్ వెంకటరావు అన్నారు. గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ మరియు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక శ్రీమహలక్ష్మి జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన అవయవదాన వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవాలు దానం చేయడం వల్ల పునర్జన్మనిస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్నిపల్లి సింహాచలంనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, కళాశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్రతీర ప్రాంతం పరిశీలన



ముక్కాంలోని సముద్రతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: మండలంలోని ముక్కాం సముద్రతీర ప్రాంతాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాల సమయంలో సముద్రపు అలలు ఎగసిపడుతుండడంతో ముక్కాం సముద్రతీర ప్రాంతం ఒడ్డున ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయని, ఈ ప్రాంతంలో ప్రహరీ గోడ నిర్మించినట్లయితే మత్స్యకారుల ఇళ్లు కోతకు గురవ్వకుండా ఉంటాయని తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు సముద్రతీర ప్రాంతాల్లో కాలువలు, అంతర్గత రహదారి నిర్మాణాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జనసేన నాయకులు లోకం ప్రసాద్, మైలపల్లి అప్పలకొండ, నరసింహులు, కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన కలెక్టర్, ఎస్పీ



డిప్యూటీ సీఎంను కలిసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్ అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్లు, ఎస్పీలకు ఏర్పాటు చేసిన విందు సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసి జిల్లా అభివృద్ధి, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను వివరించారు.

అప్రమత్తంగా రాత్రి పెట్రోలింగ్

• ఎస్పీ వకుల్ జిందల్



పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టే రాత్రి పెట్రోలింగ్, గస్తీలను నిరంతరం పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని అధికారులకు ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, అధికారులు నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రాత్రి విధులను పర్యవేక్షించేందుకు ప్రత్యక్షంగా నియమించిన ఎలర్టింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, గస్తీ సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి, జిల్లాలో ఎక్కడా నేరాలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. డయల్ 100, మహిళల భద్రతకు ఏర్పాటుచేసిన ఎస్ఓఎస్ కాల్స్ పనితీరును స్వయంగా పర్యవేక్షించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ ఈ.నరసింహమూర్తి, కంట్రోల్ రూమ్ సీఐ రాజశేఖర్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.


ప్రకృతి సోయగం



పురావస్తు శాఖ సంరక్షిస్తున్న గురు భక్తుల కొండ



నిండైన పచ్చదనంతో దర్శనమిస్తున్న దుర్గా భైరవ కొండ



సహజసిద్ధంగా దుర్గాభైరవ ఆలయం

సహజ సిద్ధమైన ప్రకృతి అందాలతో రామతీర్థం బోడికొండ సందర్శకులను కట్టి పడేస్తుంది. నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారి పక్కన కనిపించే బోడికొండ అందాలు ఒక ఎత్తైతే.. మరో అద్భుతం ఆ కొండ వెనుక భాగాన దాగి ఉంది. చుట్టూ ఎత్తైన కొండలు, ప్రకృతి పచ్చదనం పరుచుకున్నట్టు కనువిందు చేస్తున్నాయి. సీతారామునిపేట జంక్షన్ నుంచి నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తే బోడికొండ అందాలు సాక్షాత్కరిస్తాయి. దగ్గరలోనే దుర్గా భైరవ కొండ.. ఆ పక్కనే జలపాతాలు ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తాయి. సరైన రవాణా మార్గం లేకపోవడంతో సందర్శకులు అక్కడకు వెళ్లలేకపోతున్నారు. పర్యాటక శాఖ దృష్టి సారించి దీన్ని నందనవనంగా తీర్చిదిద్దాలని సందర్శకులు కోరుకుంటున్నారు.

– నెల్లిమర్ల రూరల్

కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు



జివి రంగారావు



అల్లు చాణక్య



ఎస్. నారాయణస్వామి



ఆర్. రూపాదేవి

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కమిటీలో ఐదుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా.... కేవలం 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావటంతో కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మంగళవారం అధికారికంగా ప్రకటించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా 14 డివిజన్ కార్పొరేటర్ శెట్టి వీర వెంకట రాజేశ్వరరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య, 33వ డివిజన్ కార్పొరేటర్ గొల్లపల్లి వెంకట రంగారావు, 12వ డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి, 41వ డివిజన్ కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన వారంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కాగా.. కమిటీలో శెట్టివీర వెంకటరాజేశ్వరరావు పాత కమిటీలో కొనసాగగా... మిగిలిన నలుగురు సభ్యులు నూతనంగా ఎన్నికయ్యారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సభ్యులకు మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, కార్పొరేషన్ కమిషనర్ నాయుడు ఎం.మల్లయ్య నాయుడు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పంటల బీమా పథకం అమలు చేయాలి

• డీఆర్‌ఓకు బీజేకిసాన్‌మోర్చా వినతి

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రకృతి వైపరీత్య చీడపీడలతో పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పథకం అమలు చేయాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం మోర్చా జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం డీఆర్‌ఓ ఎస్‌డీ అనితకు వినతిపత్రాన్ని అందజేసారు. రాష్ట్రంలో పంటల బీమా పథకం పడకేయడంలో పంటల నష్టపోయిన రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు పాలు అవుతున్నారని ఆరోపించారు. వర్షాల కారణంగా వరి, మినుము, పెసర, నువ్వులు, కూరగాయలు, బొప్పాయి, అరటి పంటలు దెబ్బతిన్న రైతులను, ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపాలని వినతిపత్రంలో కోరారు. డీఆర్‌ఓని కలిసిన వారిలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాలవలస సింహాచలం, కిసాన్ మోర్చా అనకాపల్లి ఇన్‌చార్జి బూర జగ్గారావు యాదవ్, నెల్లిమర్ల ఇన్‌చార్జ్ బూర్లె శ్రీధర్, విజయనగరం అసెంబ్లీ ఇన్‌చార్జి ఇమంది సుధీర్ ఉన్నారు.

పశుగణన సమాచారం కీలకం

• జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమణ



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

విజయనగరం ఫోర్ట్: పశుగణన ద్వారా సేకరించిన సమాచారం అతి కీలకమైనదని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వై.వి.రమణ అన్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాయలంలో పశుగణనపై పర్యవేక్షకులు, సూపర్ వైజర్లుకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1919వ సంవత్సరంలో పశుగణన ప్రారంభమైందని, అప్పటి నుంచి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడుతుందని తెలిపారు. చివరి పశుగణన 2019లో జరిగిందని తెలిపారు. పశుగణన మరింత అభివృద్ధి సాధించడానికి, సరైన ప్రణాళికలు రూపకల్పన చేయడానికి పశుగణన ఉపయోగపడుతుందని తెలిపారు. 21వ అధిక భారత పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జరుగుతుందని తెలిపారు. పశువుల సంఖ్యపై ప్రాథమిక సమాచారం అందించడం వివిధ పథకాల యొక్క ప్రభావాన్ని అంచనా వేయడానికి పశుగణన ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పి.లోకేష్, వెటర్నరీ పాలీ క్లినిక్ ఉప సంచాలకులు డాక్టర్ జి.మహాలక్ష్మి, బొబ్బిలి డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ ఆర్.నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

• కలిసి 'సాగు'దాం



ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షాలు అనుకూలిస్తుండడంతో వరినాట్లలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో మహిళా రైతులు కలిసి సాగేలా వరినాట్లలో వరుసకట్టారు. పూసపాటిరేగ మండలం చౌడువాడలో ఈ చిత్రం సాక్షి కెమెరాకు మంగళవారం చిక్కింది.

– పూసపాటిరేగ

పైడితల్లికి శ్రావణమాస పూజలు



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి చదురుగుడి, వనంగుడిలలో శ్రావణమాసం తొలి మంగళవారం పురస్కరించుకుని వేకువజాము నుంచి భక్తుల స్వహస్తాలతో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నివేదన చేశారు. వనంగుడిలో తొలిసారిగా నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరయ్యారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఎమ్మెల్యేకు ఆలయ వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆమెకు వేదాశీస్సులు అందజేశారు. అనంతరం నిత్యాన్నదానాన్ని ప్రారంభించి, భక్తులకు స్వహస్తాలతో అన్నప్రసాదాన్ని వడ్డించారు. సాయంత్రం చదురుగుడి ఆవరణలో దాసన్నపేట కాపువీధికి చెందిన త్రినాథస్వామి భజన బృందం నిర్వహించిన భక్తి గీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది.

సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

నెల్లిమర్ల: పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగం చేసేందుకు వీలుగా ఈ నెల 8న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పి.సుదర్శనరావు, ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓలు యూఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు చైర్మన్ ఎంపిక పూర్తవుతుందన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో నడుపుతున్న పట్టణంలోని అణగారిన పిల్లల వసతిగృహం (నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అవస్య విద్యాలయం) నిర్వహణ కోసం ఎన్జీఓల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఎన్జీఓల ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ మధ్య దరఖాస్తులను సమగ్రశిక్ష కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సన్యాసినాయుడు



యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీఐ రామకృష్ణ తదితరులు

పూసపాటిరేగ: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా వుండాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడటంతో ఎంతో మంది సున్నిత మనసు గల విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా వుండాలని సూచించారు. భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పడాల పైడిరాజుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : సీఐ

డెంకాడ: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు కూడా కఠినంగా ఉంటాయని భోగాపురం సీఐ జి.రామకృష్ణ అన్నారు. మండలంలోని చింతలవలసలో ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎన్నుకుని వాటిని అందుకునేందుకు నిత్యం పరితపించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చూడాలన్న ఆకాంక్షతో వారు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చదివిస్తున్న విషయం విద్యార్థులు మరువరాదని చెప్పారు. విద్యార్థులు తోటి విద్యార్థులను ఇబ్బందిపెట్టే విధంగా అవమానించడం, వేధింపులకు గురి చేయడం వంటి చర్యలు ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయని వివరించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలపాలన్నారు. సీనియర్లు, జూనియర్లు తేడా లేకుండా స్నేహభావంతో మెలగాలని కోరారు. యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. డెంకాడ ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి, ఎంవీజీఆర్ డైరెక్టర్ పి.సీతారామరాజు, యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్ ఎం.అనిల్‌ప్రకాష్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ సాగు విధానంతో ఖర్చు ఆదా : ఏడీఏ



డ్రమ్‌సీడర్ విధానంలో వరి సాగును పరిశీలిస్తున్న ఏడీఏ నాగభూషణం తదితరులు

డెంకాడ: డ్రమ్‌సీడర్ ద్వారా వరి పంట సాగు చేస్తే ఖర్చు తగ్గుతుందని విజయనగరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణం అన్నారు. మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో డ్రమ్‌సీడర్‌తో చేస్తున్న వరి సాగును వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏడీఏ నాగభూషణం మాట్లాడుతూ ఎకరాకు రకం బట్టి 13 నుంచి 15 కేజీల వరి విత్తనాలు సరిపోతాయన్నారు. డ్రమ్‌సీడర్‌తో ఎకరా పొలంలో ఇద్దరు కూలీలతో రెండు గంటల వ్యవధిలో వరిని విత్తవచ్చాన్నారు. సాధారణ ఊబాలతో పోలిస్తే డ్రమ్‌సీడర్ విధానంలో వరిని సాగు వలన 10 రోజుల ముందుగానే కోతకు వస్తుందన్నారు. దిగుబడి కూడా 10 నుంచి 15 శాతం పెరుగుతుందన్నారు. డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తే చాలా ఖర్చు రైతులకు మిగులుతుందని చెప్పారు. రైతులు ఈ విధానంలో వరిపంటను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పి.నిర్మల, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవకులు



ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కోలగట్లను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: ప్రతీ ఒక్కరూ సమాజ హితాన్ని కోరుకుంటూ తాను సంపాదించిన దానిలో కొంత భాగాన్ని సమాజసేవకు వినియోగించాలని ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షుల చిత్రపటాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవకులని, ఏ కార్యక్రమం చేపట్టిన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయపడతారన్నారు. ఆర్యవైశ్య సంఘం పూర్వ అధ్యక్షుల ఫొటోలు సంఘం భవనంలో ఏర్పాటుచేయడం చాలా గొప్ప విషయమన్నారు. పెద్దలు, మహనీయులను ఎల్లప్పుడూ స్మరిస్తూ వారి అడుగుజాడల్లో అందరం నడవాలన్నారు. సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 1934లో స్థాపించిన సంఘం 90వ ఏట అడుగుపెట్టిందన్నారు. కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్త మాట్లాడుతూ 26 మంది అధ్యక్షుల ఫొటోలు నెలకొల్పడం వారి కుటుంబ సభ్యులకు ఈ సమావేశంలో స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సంస్థ చేపడుతున్న సేవాకార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కోలగట్లను ఉచితరీతిన సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, బలభద్రుని నానాజీ, ఏడుకొండలు, రాంజీ, మండవిల్లి వెంకటరాజు, తవ్వా మోహనరావు, పెంటపాటి కామరాజు, బొడ్డు సత్యనారాయణ, డిమ్స్ రాజు, గుంపిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.